క్లుప్తంగా

వీరభద్రునికి వెండి సమర్పణ


వెండిని సమర్పిస్తున్న దాతలు

కామవరపుకోట : స్థానిక వీరభద్ర స్వామి, అమ్మవార్ల ఆలయ ముఖద్వారం నిమిత్తం పశ్చిమగోదావరి జిల్లా నిడమర్రు మండలం భువనపల్లి గ్రామానికి చెందిన కొత్తేల సుబ్బారావు, కుమారుడు కొత్తేల కార్తికేయ ఒక కేజీ వెండిని బహూకరించారు. ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం ఈ వెండిని అందజేశారు. ఆలయ ధర్మకర్త కొండూరు శ్రీధర్, కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శ్రీను, వందనపుమురళి, ఉదయ్ కుమార్, కాళీ, రామకృష్ణ, అర్చకులు మేడూరి శర్మ, అంబికేశ్వర శర్మ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

బీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ


కామవరపుకోటలో బీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ

కామవరపుకోట : మండల బహుజన టీచర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎంపీడీవో కె.శ్రీదేవి, ఎంఈఓ డి.సుబ్బారావు ఆవిష్కరించారు. ముందుగా సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కె.శ్రీదేవి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఆనాటి సమాజంలో స్త్రీలకు ఆదర్శంగా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి స్త్రీ ఉద్ధరణ కోసం పాటుపడ్డారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కస్సే శ్రీను, రఘు, గిరిబాబు, ఆనందరాజు, బాబురావు, బాలస్వామి, నిర్మల కుమారి, లలిత కుమారి, పోలిమెట్ల శ్రీనివాసరావు, వెంకట్ పాల్గొన్నారు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో అన్నదానం

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణం అశ్వారావుపేట రోడ్ రాజులకాలనీ ముఖద్వారం వద్ద ఉన్న స్వయంభూ శ్రీ సుందర బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ సన్నిధిలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. అన్నదాన కమిటీ అధ్యక్షుడు కానూరి గంగాధరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన మాడా ప్రవీణ్ కుమార్, లావణ్య దంపతుల కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. సుమారు 900 మందికి పైగా భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి మంగళవారం దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామన్నారు.

నిర్వాసితులకు పరిహారం వెంటనే చెల్లించాలి

కుక్కునూరు : పోలవరం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ ముంపు కారణంగా సర్వం కోల్పోయి నిరాశ్రయులవుతున్న నిర్వాసితులకు వెంటనే ఆర్‌అండ్‌ఆర్ పరిహారం రూ.10 లక్షలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి నాగేంద్రరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితుల త్యాగాల పునాదులపై పోలవరం ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నామంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాజెక్ట్ నిర్మాణంలో చూపిస్తున్న శ్రద్ధ నిర్వాసితులకు పునరావాస పరిహారం చెల్లించడంలో మాత్రం చూపించడం లేదని విమర్శించారు. గోదావరి వరదతో ఇళ్లు కూలిపోయి నిరాశ్రయులైన బాధితులకు నేటివరకు నష్టపరిహారం జమకాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 5న జంగారెడ్డిగూడెం ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో నిర్వాసితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పేకాట స్థావరంపై దాడి

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల శివారులో మంగళవారం పేకాట ఆడుతున్న 5 గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 2,100 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన చెప్పారు.

6 నుంచి హ్యాండ్‌బాల్ సెలెక్షన్లు

దెందులూరు : వేగవరం హేలాపురి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నుంచి జరగాల్సిన హ్యాండ్‌బాల్ ఎంపిక ఈ నెల 6వ తేదీకి మార్చినట్లు కళాశాల ఏఓ కరుణానిధి తెలిపారు. 8 జిల్లాల్లోని ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు సెలక్షన్లలో పాల్గొంటారన్నారు. సత్తా చాటిన క్రీడాకారులు తమిళనాడులోని వర్సిటీలో జరిగే పోటీల్లో పాల్గొంటారని కరుణానిధి వివరించారు. మంగళవారం కళాశాల గ్రౌండ్‌ను జేసీబీ, ట్రాక్టర్‌తో చదును చేశారు.

ధాన్యం అమ్మకాలపై అవగాహన కల్పించండి

పెదపాడు : ధాన్యం అమ్మకాలపై ప్రభుత్వం చేపట్టిన నూతన విధానాన్ని రైతులకు అవగాహన కల్పించాలని పెదపాడు ఏవో వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో వ్యవసాయ సహాయకులతో ఆయన సమీక్షించారు. ఏ గ్రామంలో ఎంతమేర ధాన్యం తరలించారు, కొనాల్సిన ధాన్యం ఎంత, గోనె సంచుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలి


జంగారెడ్డిగూడెం జెడ్పీహైస్కూల్‌లో సావిత్రిబాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



సీఎస్‌టీఎస్ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహిస్తున్న ఉపాధ్యాయ బృందం


రావికంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

జంగారెడ్డిగూడెం : మహిళాభ్యున్నతికి సావిత్రిబాయి పూలే చేసిన కృషి అనిర్వచనీయమని, ప్రతి ఒక్కరు ఆమె ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని జెడ్పీ బాలుర హైస్కూల్ హెచ్‌ఎం గెడా జగ్గారావు అన్నారు. మంగళవారం హైస్కూల్‌లో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జగ్గారావు మాట్లాడుతూ భారత తొలి మహిళా ఉపాధ్యాయినిగా, అంటరానితనం, కుల వివక్ష, బాల్య వివాహాలకు, వితంతు మహిళలపై జరుగుతున్న సామాజిక కట్టు బాట్లకు వ్యతిరేకంగా సమరం సాగించిన సామాజిక ఉద్యమ కారిణి పూలే అని పేర్కొన్నారు. బాలికలు, మహిళల, బడుగు వర్గాల కోసం పూలే దంపతులు చేసిన కృషిని ప్రతి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకుని, విద్యా వ్యాప్తికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఫస్ట్ అసిస్టెంట్ సుధాకర రెడ్డి, స్టాఫ్ సెక్రటరీ కట్టా శ్రీను, స్కౌట్, ఎన్‌సీసీ విద్యార్థులు, కో-ఆర్డినేటర్స్ శ్రీహరిబాబు, అల్లాహ్‌భ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రివేణి ప్రసాద్ జూనియర్ కళాశాలలో

బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ హక్కుల సాధన ఐక్య వేదిక ఆధ్వర్యంలో స్థానిక త్రివేణి ప్రసాద్ జూనియర్ కళాశాలలో చిట్టిబోయిన రామలింగేశ్వరరావు ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ముఖ్య అతిథిగా ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దాసరి శ్యామ్ చంద్ర శేషు హాజరుకాగా నాయకులు కోనేటి చంటి, కళాశాల ప్రిన్సిపాల్ హెచ్ బి ప్రసాద్, కొంచాడ ప్రసాద్, గుల్లపూడి శ్రీదేవి, చిత్తపురి దుర్గేష్, మల్లిపూడి నవీన్, తాళ్లూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌టీఎస్ కళాశాలలో...

జంగారెడ్డిగూడెం సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఆర్ట్స్ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రసాద్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా జంగారెడ్డిగూడెం గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ ఎస్.సంఘర్షిణి పాల్గొని మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే గొప్ప సంఘ సంస్కర్త అన్నారు. సావిత్రిబాయి భారతదేశంలో గొప్ప సాంఘిక మార్పు కోసం పోరాడిన వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఝాన్సీరాణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రావికంపాడులో...

కామవరపుకోట : రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు వక్తృత్వం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉమ్మడి భీమరాజు, తెలుగు ఉపాధ్యాయుడు బిరుదుగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆనాటి అజ్ఞాన సమాజంలో నలుగుతున్న స్త్రీ జాతికి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి అక్షర విలువలు నేర్పిన మహనీయురాలు సావిత్రిబాయి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, మూర్తి, సతీష్‌కుమార్, గస్‌బాబు, రవీంద్ర, విజయకుమారి, చైతన్య, రాధిక, జయశ్రీ, పల్లాలు, రమేష్, శ్రీనివాసరావు, మురళి, జయరాజు, రాధాకృష్ణ, బాలాజీ పాల్గొన్నారు.

స్థానిక కామవరపుకోట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నతానియల్ సావిత్రిబాయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థినిలందరూ భారతీయ సాంప్రదాయ వస్త్రధారణలో పాల్గొన్నారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె రవీంద్రబాబు, అధ్యాపకులు ఎం.మల్లేశ్వరరావు, డాక్టర్ జి.శ్రీనివాసరావు, డి.మల్లేష్, వి.శ్రీనివాస్, ఎ.హర్షవర్ధని, నజ్మా, ఆఫీస్ సిబ్బంది, చంద్రమోహన్, అన్నపూర్ణమ్మ, రత్న సిరి, కుమార్ రాజా పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి


చింతలపూడిలో సావిత్రీబాయి పూలే విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

చింతలపూడి : సావిత్రిబాయి పూలే జయంతిని చింతలపూడిలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. సావిత్రిబాయి పూలే విగ్రహానికి బీసీ నేతలు, ఉద్యోగ సంఘాల నేతలు పూలవూలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే జీవితం నేటి మహిళలకు ఆదర్శనీయమన్నారు. కుల వివక్ష, అంటరానితనం, బాల్య వివాహాలు, మహిళా సాధికారతకు ఎనలేని కృషి చేశారని అన్నారు. ఆమె త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని మహిళలు ముందుకు సాగాలని కోరారు. సావిత్రిబాయి పూలే జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు కోడూరి శ్రీనివాసరావు, ఆర్నేపల్లి అప్పారావు, బీవీఎస్ఎన్ రాజు, బి శ్రీనివాసరావు, ముక్కు అప్పారావు, వాకాడ గణేష్, వేణు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

స్కిల్ హబ్ ద్వారా నిరుద్యోగ యువతకు శిక్షణ

జంగారెడ్డిగూడెం : యువతకు వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో వివిధ కోర్సులలో ఉచిత నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఈ.తమ్మాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం జెడ్పీ హైస్కూల్ ఎదురుగా ఉన్న నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ వద్ద స్కిల్ హబ్ ద్వారా అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ డెకరేటివ్ పెయింటర్ వంటి కోర్సులలో ఉచిత నాన్ రెసిడెన్షియల్ శిక్షణ ఇచ్చి తద్వారా ఉపాధి కల్పిస్తామన్నారు. పదవ తరగతి లేదా ఆపైన చదివి 18-35 సంవత్సరాలు గల యువతీ యువకులు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 6వ తేదీలోగా స్కిల్ హబ్ ఇన్‌చార్జి రమేష్ 98495 06603 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

నవోదయకు బండివారిగూడెం విద్యార్థిని ఎంపిక


నవదోయకు ఎంపికైన కొలుకులూరి వైష్ణవి

టి.నరసాపురం : 2022-23 విద్యాసంవత్సరానికిగాను 6వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన నవోదయ ఎంట్రన్స్ టెస్ట్‌లో బండివారిగూడెం ఎంపీయూపీ స్కూల్ విద్యార్థిని కొలుకులూరి వైష్ణవి అర్హత సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసరావు తెలిపారు. ఇటీవల వెల్లడించిన రెండవ జాబితా ఫలితాల్లో వైష్ణవి పెదవేగి జవహర్ నవోదయలో 6వ తరగతిలో ప్రవేశం పొందినట్లు చెప్పారు. విద్యార్థినిని సర్పంచ్ నాళం శిరీష, ఎంపీటీసీ చింత నాగమణి తదితరులు అభినందించారు.

జూద క్రీడలకు దూరంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ బాలా సురేష్

జంగారెడ్డిగూడెం రూరల్ : పేకాట, కోడి పందాలు వంటి జూద క్రీడలకు దూరంగా ఉండాలని జంగారెడ్డిగూడెం సీఐ బాలా సురేష్ అన్నారు. జూద క్రీడల వలన కలిగే అనర్థాలపై దేవులపల్లిలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ బాలా సురేష్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పల్లెల్లో ఆనందంగా జరుపుకోవాలన్నారు. పండుగ వేళల్లో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహించినా, ఆడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జూద క్రీడలు నిర్వహించే ప్రదేశాలను ఇప్పటికే గుర్తించామని, నిర్వాహకులపై బైండోవర్ కేసులు పెట్టి తహసీల్దార్ వద్ద హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దోరేపల్లి సత్యనారాయణ, లక్కవరం ఎస్సై దుర్గ మహేశ్వరరావు పాల్గొన్నారు.

బాధితుల ఖాతాల్లో నష్టపరిహారం జమ

కుక్కునూరు : జూన్ నెలలో గోదావరి వరదల కారణంగా ఇళ్లు కూలిపోయి నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం రూ.10 వేలు మంగళవారం కుక్కునూరు ఏ బ్లాక్‌కు సంబంధించిన ముగ్గురు బాధితుల ఖాతాల్లో జమైంది. గోదావరి వరదతో ఇళ్లు కూలిపోయిన వారి ఖాతాల్లో ప్రభుత్వం ప్రకటించిన రూ.10 వేల నష్టపరిహారం వెంటనే జమచేయాలని కోరుతూ కుక్కునూరు ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు డిసెంబర్ 31న జెడ్పీ సీఈఓ ను కలిసి వినతిపత్రం అందించారు. కాగా మంగళవారం కుక్కునూరు ఏ బ్లాక్‌కు చెందిన ముగ్గురి బాధితుల ఖాతాల్లో సొమ్ము జమ కావడంతో తక్కిన వారికి కూడా త్వరలోనే నష్టపరిహారం అందుతుందని బాధితులు ఆనందం వ్యక్తం చేశారు.

పెంచిన పింఛన్లతో లబ్ధిదారులకు పండగ

కొయ్యలగూడెం : సంక్రాంతి, న్యూ ఇయర్ వరుస వేడుకలను లబ్ధిదారులు పెంచిన పింఛన్లతో మరింత ఆనందంతో నిర్వహించుకోగలుగుతున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పేర్కొన్నారు. మంగళవారం కొయ్యలగూడెంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. క్రమేపి రూ.2,750కు పింఛన్ చేరుకుందని, ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేలు అందజేయడమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అని బాలరాజు పేర్కొన్నారు. ఎంపీపీ గంజిమాల రామారావు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, వైస్ ఎంపీపీలు తుమ్మలపల్లి గంగరాజు, మట్టా వనజలక్ష్మి, మండల పట్టణ కన్వీనర్లు గొడ్డటి నాగేశ్వరరావు, సంకుకొండ, పీఏసీఎస్ అధ్యక్షుడు మంతెన సోమరాజు, ఎంపీటీసీలు చింతా శ్రీదేవి, గంటా శ్రీను, ఘంటసాల సీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెంలో బుధవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, పీపీఎస్ చంద్రరావు తెలిపారు. స్థానిక బుట్టాయగూడెం రోడ్‌లోని రాజరాణి కళ్యాణమండపంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా చేతుల మీదుగా రూ.2750 వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులకు అందజేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

లివింగ్ శాక్రిఫైస్ ఆధ్వర్యంలో రగ్గుల పంపిణీ


శ్రీరంగపట్నంలో వృద్ధులకు రగ్గులను పంపిణీ చేసిన దృశ్యం

కొయ్యలగూడెం : అచ్యుతాపురం పంచాయతీ శ్రీరంగపట్నంలో లివింగ్ శాక్రిఫైస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులు 50 మందికి మంగళవారం ఉన్ని రగ్గులను పంపిణీ చేశారు. సంస్థ డైరెక్టర్ దేవ సహాయం మాట్లాడుతూ శీతాకాలంలో చలిని తట్టుకోవడం కోసం వృద్ధులకు నాణ్యమైన ఉన్ని రగ్గులను అందజేస్తున్నామన్నారు. గత డిసెంబర్‌లో 1200 మందికి పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో సంస్థ ట్రెజరర్ ప్రేమ కుమారి, జాయింట్ సెక్రటరీ డి.కనకరాజు, వార్డు సభ్యులు ముమ్మడి సర్వేశ్వరరావు, కాలింగి రమణ, గ్రామ పెద్దలు ముమ్మడి రాంబాబు, జి.సత్యనారాయణ, ఎన్.సత్యనారాయణ, సంస్థ సభ్యులు ఎం.దుర్గాప్రసాద్, బి.కృష్ణకాంత్ పాల్గొన్నారు.

శ్మశానవాటికకు భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ శాంతి

బుట్టాయగూడెం : మండలంలోని రెడ్డిగణపవరం సచివాలయ పరిధిలోని వెలుతురువారిగూడెం సమీపంలో ఉన్న ములకలగూడెం నిర్వాసిత కాలనీని తహసీల్దార్ ఎస్.శారాశాంతి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆ కాలనీలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పునరావాస కాలనీకి సంబంధించి శ్మశానవాటిక భూమిని ఆమె పరిశీలించారు. ఆ భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామమైన ములకలగూడెం గ్రామానికి ఎకరంన్నర భూమి శ్మశానవాటికకు అవసరమవుతుందని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ సమీపంలో ఉన్న భూమిని పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ, వీఆర్‌ఏ, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల ఆరాధ్య దైవం జయపాల్ సింగ్


ఐటీడీఏ వైటీసీలో యువతకు గడియారాన్ని బహుకరిస్తున్న జేఏసీ నాయకులు

బుట్టాయగూడెం : భారత రాజ్యాంగ రూపకల్పనలో డ్రాఫింగ్ కమిటీ సభ్యుడైన జయపాల్ సింగ్ ముండా 120వ జయంతి కార్యక్రమాన్ని మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏ వైటీసీ ప్రాంగణంలో మంగళవారం ఆదివాసీ ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నడపల సోమరాజు మాట్లాడుతూ జయపాల్‌సింగ్ ముండా షెడ్యూల్ ప్రాంత రూపశిల్పే కాకుండా ఆదివాసీ ఆరాధ్య దైవమని అన్నారు. అనంతరం వైటీసీలో శిక్షణ పొందుతున్న యువతకు గడియారాన్ని బహుకరించారు. కార్యక్రమంలో ఐటీడీఏ సిబ్బంది, ఆదివాసీ మహాసభ జిల్లా కార్యదర్శి మూలెం రాంబాబు, అధ్యక్షుడు మిడియం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోండి


సమావేశంలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి

చింతలపూడి : పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్కే ఇబ్రహీం షరీఫ్ న్యాయవాదులకు సూచించారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులతో మంగళవారం ఆయన ఫిబ్రవరి 11న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌పై సమీక్ష నిర్వహించారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి న్యాయవాదులు కృషి చేయాలన్నారు. రాజీపడదగ్గ కేసులను రాజీ చేయించి కోర్టులపై కేసుల భారాన్ని తగ్గించే బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. సివిల్ కేసుల్లో రాజీ చేసుకుంటే కోర్టుకు కట్టిన ఫీజు కూడా వెనక్కు వస్తుందని చెప్పారు. జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరి కేసులు, చెక్ బౌన్స్ కేసులు, కుటుంబ తగాదా కేసులు ప్రతి రోజు ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్స్ ద్వారా రాజీ చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నరుకుళ్ళ సత్యన్నారాయణ, న్యాయవాదులు పాల్గొన్నారు.

భైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలి


చింతలపూడిలో నిరసన ప్రదర్శన చేస్తున్న హిందువులు

చింతలపూడి : తెలంగాణ రాష్ట్రం వరంగల్ సభలో హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా అయ్యప్ప స్వామి పుట్టుక, హిందూ దేవుళ్లపై అనుచితంగా, అసభ్యకరంగా వ్యాఖ్యలు చేసిన భైరి నరేష్, రేంజర్ల రాజేష్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ ప్రచార కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం పట్టణంలో అయ్యప్ప స్వామి ఆలయం నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు హిందూ భక్తులు ప్రదర్శన నిర్వహించారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరారు. బోసుబొమ్మ సెంటర్‌లో మానవ హారంగా ఏర్పడి నిరసన తెలిపారు. నిరసనలో పార్టీలకు అతీతంగా ప్రజలు పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్ కృష్ణజ్యోతికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు విశ్వనాధరావు శ్రీనివాసరావు, గురుస్వాములు మల్లిఖార్జున్, కాలినీడి రాంబాబు, ఎన్ దుర్గారావు, తోట శివనాగరాజు, శేఖర్, ముత్యాల శ్రీనివాసరావు, కొట్టే నారాయణ, రవికుమార్, తోట వెంకట నారాయణ, మణికుమార్, సిరగం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ కృషితో విద్యాభివృద్ధి


విద్యార్థినికి ట్యాబ్ అందిస్తున్న కార్పొరేటర్ రాము

ఏలూరు రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషితో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధి సాధ్యమవుతోందని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. మంగళవారం 15 డివిజన్ ప్రభుత్వ పాఠశాల పిల్లలకు ట్యాబ్స్ పంపిణీ చేశారు. టీడీపీ హయాంలో కంప్యూటర్ నాలెడ్జ్, ట్యాబ్స్ ఉన్నత వర్గానికే పరిమితమయ్యాయన్నారు. నేడు సీఎం జగన్ పాలనలో బడుగు, బలహీనవర్గాల పిల్లల చేతులకు సైతం ట్యాబ్స్ అందుతున్నాయని ఆనందం వ్యక్తం చేశారు. ప్రభుత్వ బడుల్లో సైతం ఇంగ్లిషు మీడియం లో అందుబాటులో వచ్చిందన్నారు. హెచ్‌ఎం పెదబోయిన లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ మార్గదర్శకత్వంతోనే ఉజ్వల భవిష్యత్తు

భీమడోలు : కెరీర్ మార్గదర్శకత్వం విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాట వేస్తుందని జిల్లా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు అన్నారు. మండలంలోని పూళ్ల, ఎంఎంపురం, కురెళ్లగూడెం, గుండుగొలను, భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలు, పోలసానిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని బాలబాలికలకు మంగళవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్, ప్రతిభ గల విద్యార్థులు 23 మందికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు, పుస్తకాలు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. కెరీర్ గైడెన్స్ జిల్లా డైరెక్టర్లు టీవీ ఉమామహేశ్వరరావు, తాడేపల్లి మోహనరావు, జి.నూకరాజు మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యను ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. ఇష్టపడితో చదివితే ఉన్నతంగా రాణిస్తారని, లక్ష్య సాధనకు ప్రతి విద్యార్థి ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. తొలుత బాలబాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు, ఏలూరి వీరాస్వామి, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకటకృష్ణారావు, పెద్దలు దాసం మంగయ్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్హులకు పింఛన్ల పంపిణీ


బుట్టాయగూడెం మండలంలోని రేపల్లె వృద్ధులకు పింఛన్లు అందజేస్తున్న వలంటీర్


టి.నర్సాపురంలో వృద్ధురాలు నారాయణమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీర్

బుట్టాయగూడెం : ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన నూతన పింఛన్లతో ఏజెన్సీ ప్రాంతంలో సందడి నెలకొంది. ఇప్పటికే మండల వ్యాప్తంగా 21 పంచాయతీల పరిధిలో 7 వేల పింఛన్లను నూతన సంవత్సరం తెల్లవారుజామునే పంపిణీ చేశారు. నూతనంగా మంజూరైన పింఛన్లను గత రెండురోజులుగా వలంటీర్‌లు పంపిణీ చేస్తున్నారు. మారుమూల అటవీప్రాంతంలో వలంటీర్‌లు పొలం పనులకు వెళ్లిన వారి వద్దకు వెళ్లి పింఛన్లు అందజేశారు. అలాగే మండలంలోని రెడ్డిగణపవరం పంచాయతీ పరిధిలోని వి.నారాయణమ్మ అనే వృద్ధురాలు టి.నర్సాపురం మండలం బండివారిగూడెంలో బంధువుల ఇంటి వద్ద ఉండగా గ్రామ వలంటీర్ యు.మంగ 25 కిలోమీటర్లు ప్రయాణం చేసి వెళ్లి పింఛనును ఆమెకు అందజేశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందాలనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని నెరవేర్చేందుకు కృషిచేస్తున్నట్లు వలంటీర్లు తెలిపారు.